క్లుప్తంగా

'వెన్నుపోటు దినం' నిరసనకు తరలిరండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు వసంత రెడ్డి తదితరులు

టెక్కలి: కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలపై ఈ నెల నాలుగో తేదీన టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని సంతబొమ్మాళి మండల జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బుడ్డ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సంతబొమ్మాళిలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి సంబంధించి ఆదివారం టెక్కలిలో పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు అంగ జనార్దనరావు, అంగ మల్లేశ్వరరావు, బత్తిని పకీరు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో పోలీసుల కార్డెన్ సెర్చ్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో డీఎస్పీ వెంకటఅప్పారావు ఆదేశాల మేరకు శనివారం వేకువజామున నాలుగు నుంచి ఉదయం ఏడు గంటల వరకూ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ నేతృత్వంలో వెంకటేశ్వరకాలనీ, పోస్టాఫీసు కాలనీలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, నంబర్‌ప్లేట్లు లేకుండా ఉన్న 27 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అక్రమ కట్టడం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 24వవార్డు పురుషోత్తపురం గ్రామంలో 22/7 సర్వేనంబర్‌లో కాలువ పోరంబోకు స్థలంలో దుకాణ నిర్మాణం చేపట్టడంతో రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పలాస తహసీల్దార్ కల్యాణచక్రవర్తి ఆదేశాల మేరకు ఆర్‌ఐ కంచరాన ఖగేశ్వరరావు, వీఆర్వోలు జుబీర్, నౌషిద్‌లు శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇటీవల కాలువ పోరంబోకు స్థలమని అధికారులు హెచ్చరించినా లెక్కచేయకుండా కట్టడంతో నోటీసులు సైతం అందజేశారు. విద్యుత్ తీగలపై జరుగుతున్న నిర్మాణంలో ఎవరికైన ప్రమాదం జరిగితే నిర్మాణం చేపడుతున్నవారిదే బాధ్యత అని.. నిర్మాణ పనులకు వచ్చే మేస్త్రీలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులో పొందుపరిచారు. దీనిని తొలగించిన వారిపైనా చర్యలు ఉంటాయని అందులో పేర్కొన్నారు.

కౌన్సిలర్లంటే అంతచులకనా..?



ప్రోటోకాల్‌పై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ మాధవరావు

కాశీబుగ్గ: ప్రజలచేత ఎన్నుకోబడిన సభ్యులను కాదని ఎటువంటి అర్హతలేని కొంతమందితో ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఐదు, 11వ వార్డుల కౌన్సిలర్లు కర్రి మాధవరావు, దుర్గాశం కర్‌పండాలు అన్నారు. ప్రోటోకాల్ పాటించకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ బి.గిరిబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. గత నెల వాయిదా పడ్డ ఎజెండాకు ఆమోదం తెలపగా కౌన్సిలర్‌లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఐదోవార్డు పరిధిలో కౌన్సిలర్‌గా తనకు ఎటువంటి సమాచారం లేకుండా సీసీ డ్రైన్‌లు, రోడ్డు వేయడం అవమానించడమేనని మాధవరావు అన్నారు. అధికార పార్టీ నాయకులు ఎన్నికలలో గెలిచి పనులు చేపట్టాలి తప్పా అధికార దుర్వినియోగానికి పాల్పడటం సరికాదని అన్నారు. తాళ్లభద్ర, నీలాపురం, ఉప్పరిపేటతో పాటు పరిసర ప్రాంతంలో ఉద్దాన మంచినీరు సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. కాశీబుగ్గ 17వవార్డు భాస్కరరామ థియేటర్ వద్ద రోడ్డు తవ్వి పైపులైన్ వేయకుండా రెండు నెలలుగా విడిచిపెట్టారని, అలాగే కాశీబుగ్గ శ్మశానవాటిక గంజాయి, మద్యం సేవించేవారు, పేకాట ఆడేవారితో నిండిపోతుందని, అలాగే మున్సిపల్ ఎజెండా కాపీ వాట్సాప్ గ్రూప్‌లలో ముందే చక్కర్లు కొడుతుందని కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ఆరోపించారు. కోర్టు వివాదాల్లో ఉన్న ప్రాంతంలో అత్యవసరంగా సీసీ రోడ్డు వేయాల్సిన అవసరం ఏముందని 21వ వార్డు కౌన్సిలర్ పప్పల ప్రసాద్ అన్నారు. మున్సిపల్ ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీరు సైతం దుర్వినియోగం జరుగుతోందని 11వ వార్డు కౌన్సిలర్ శంకర్ పండా ఆరోపించారు. మున్సిపాలిటీలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ బి.క్రిష్ణారావు, కమిషనర్ ఎన్.రామారావు పాల్గొన్నారు.

కౌలురైతులు గుర్తింపు కార్డులు పొందాలి

కవిటి: మండలంలోని అర్హత గల కౌలు రైతులంతా విధిగా గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి అన్నారు. బల్లిపుట్టుగలో కౌలురైతు గుర్తింపు కార్డుల జారీలో భాగంగా అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు, బృందావన్‌దొళాయి పాల్గొన్నారు.

కూటమి పాలనలో పింఛన్లు ఇవ్వకుండా వేధించారు...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మా గ్రామంలో ఎనిమిది మంది వృద్ధులకు పింఛన్ ఇవ్వకుండా కక్ష పూరితంగా వ్యవహరించారు. దీనిపై పింఛన్‌దారులతో కలిసి మూడు నెలల పాటు పోరాటం చేశాం. చివరకు బాధిత పింఛన్‌దారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. మా ఒక్క గ్రామంలోనే కాదు ప్రతీ గ్రామంలో ఇదే మాదిరిగా అమాయకులైన పింఛన్‌దారులను వేధించారు.

–సంపతిరావు ధనలక్ష్మి, సర్పంచ్, మాసాహెబ్‌పేట, కోటబొమ్మాళి మండలం

ఏడాదిగా తిరుగుతున్నాను..



నా భర్త చనిపోయి ఏడాది పైగా అయ్యింది. వితంతు పింఛన మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఫలితం లేదు. దీంతో చాలా ఇబ్బందిపడుతున్నాను. సచివాలయ సిబ్బందిని అడిగితే కేవలం స్పౌజ్ పింఛన్లు మాత్రమే మంజూరు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఇలా అయితే ఒంటరి మహిళలు, వితంతులు, వృద్ధుల పరిస్థితి ఏమిటి. అధికారులు స్పందించి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

–రెల్ల ప్రభ, మందస మండల కేంద్రం

ఏడాది నుంచి తిరుగుతున్నా..



పింఛన్ కోసం సచివాలయం చుట్టూ ఏడాదిగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎవరిని అడిగినా రేపు మాపు అంటూ తిప్పుతున్నారు. చాలా పేదవాడిని. రెక్కాడితే గాని డొక్కాడదు. అధికారులు స్పందించి ఇప్పటికైనా పింఛన్ వచ్చే విధంగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలి.

– పుచ్చ తాతారావు, వృద్ధుడు, నీలావతి, పలాస మండలం

కొత్త పింఛన్లు ఎందుకు మంజూరు చేయరు?



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుల్లో దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి సర్కార్ ఏర్పాటై ఏడాది కావస్తున్నా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడం దారుణం. ఏడాదిగా కొత్త పింఛన్ల ఊసే ఎత్తడం లేదు. అసలు ఎందుకు పింఛన్లు మంజూరు చేయడం లేదో అర్థం కావడం లేదు.

– శర్వాణ గీత, కౌన్సిలర్, 10వవార్డు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

కొత్త పింఛన్లు నిల్..!

టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పింఛన్ల వివరాలు..

మండలం	వైఎస్సార్‌సీపీ హయాంలో పింఛన్లు	కూటమి పాలనలో పింఛన్లు
టెక్కలి	10,451	9,966
నందిగాం	9954	9,549
సంతబొమ్మాళి	11,608	11,081
కోటబొమ్మాళి	11,568	10,995

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సామాజిక పింఛన్ల వివరాలు ఇలా..

మండలం	2024 ఫిబ్రవరి వరకు	ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్లు
ఇచ్ఛాపురం	4,286	4,056
ఇచ్ఛాపురం రూరల్	7,491	7,117
కవిటి	11,812	11,191
కంచిలి	9,912	9,460
సోంపేట	11,708	11,119



కాశీబుగ్గ: వితంతు పింఛన్ మంజూరు కోసం పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ రామారావుకు దరఖాస్తు అందజేస్తున్న మహిళ

- ఉన్న పింఛన్లను కుదించేసిన కూటమి సర్కార్
- చంద్రన్న పాలనలో పింఛన్‌దారులకు అవస్థలు



కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత పింఛన్‌దారులకు కష్టాలు ఆరంభమయ్యాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఒకటో తేదీ వేకువజామునే ఇంటి వద్దకు వలంటీర్లు వచ్చి పింఛన్లు అందజేసేవారు. ఐదేళ్ల పాలనలో పింఛన్లను తొలగించలేదు. అలాగే అర్హులందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని గ్రామాల్లో నాయకులు కక్ష పూరితంగా వ్యవహరిస్తూ ఇష్టం లేనివారి పింఛన్లను నిలిపివేశారు. పింఛన్లు పునఃపరిశీలన పేరుతో దివ్యాంగులకు కష్టాలు తెచ్చిపెడుతున్నారు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న పింఛన్లు కుదించే విధంగా కూటమి ప్రభుత్వం పగ సాధిస్తోంది. టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పాలనలో 43,581 పింఛన్లు ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 41,591 పింఛన్లకు కుదించేశారు. దీన్నిబట్టి కూటమి ప్రభుత్వం ఎంతలా బరితెగిస్తుందో అర్థం చేసుకోవచ్చు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో వందలాది మంది పింఛన్లను కేవలం కక్షసాధింపుతోనే కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి నిలిపివేశారు. కేవలం స్పౌజ్ పింఛన్లు తప్పితే ఒక్క కొత్తపింఛన్ కూడా మంజూరు కాలేదు.

–సాక్షి నెట్‌వర్క్

పింఛన్ మంజూరు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు పింఛన్లు అందించడంలో ఎటువంటి జాప్యం చేయరాదు. మాలాంటి పేదల కడుపునిండా తిండితినేందుకు నెలనెలా పెన్షనే ఆధారం. అరవై ఏళ్ల వయసులో నాలాంటి వారికి పెన్షన్ జీవనాధారం. పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

–మొగిలిపురి పూర్ణచంద్ర, కవిటి మండలం

నిరుపేదను పింఛన్ ఇవ్వండి



రోజూ కూలి పనికి వెళ్లకపోతే కుటుంబం గడవదు. గత ఏడాదికే నాకు అరవై ఏళ్లు పూర్తయ్యాయి. శరీరంలో శక్తి తగ్గుతోంది. గతంలో చేసినంత సత్తువతో పనిచేయలేకపోతున్నాను. వృద్ధాప్య పింఛన్ కోసం గ్రామ సచివాలయంలో చేసిన దరఖాస్తు ఏమైందో తెలియదు. తక్షణమే నాలాంటి వారికి పింఛన్ అందించి ప్రభుత్వం దయచూపాలి. మాలాంటి పేదల బతుకులు పెన్షన్‌తోనే నడుస్తాయి.

– చొట్టా నారాయణ, ఆర్. తొత్తిడిపుట్టుగ, కవిటి మండలం

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి



చక్రవర్తిని అభినందిస్తున్న తిలక్, నాయకులు

టెక్కలి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన యర్ర చక్రవర్తి తిలక్‌ను మర్యాద పూర్వకంగా శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. వివిధ అనుబంధ విభాగాల్లో నియామకమైన వారంతా సమిష్టిగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను నిలదీస్తూ ప్రజలకు అండగా ఉండాలని కోరారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, టెక్కలి, నందిగాం మండలాల పార్టీ కన్వీనర్లు హెచ్.వెంకటేశ్వర్రావు, టి.ఫాల్గుణరావు, పట్టణ అధ్యక్షుడు టి.కిరణ్, నాయకులు సత్తారు సత్యం, కిల్లి అజయ్‌కుమార్, కర్నిక జీవన్, పీత రమణబాబు, బమ్మిడి తులసీరావు, కె.నారాయణమూర్తి, పోలాకి మోహన్, టి.వైకుంఠరావు, చిన్ని జోగారావు, ఎ.విష్ణు ఉన్నారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

నందిగాం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియామకం చేసిన పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని యర్ర చక్రవర్తి అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం లభించేందుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాల్య వివాహాలను అరికడదాం



ఈదుపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: బాల్య వివాహాలను అరికడదామని నేషనల్ యూత్ వలంటీర్ హంగిర్ బెహరా పిలుపునిచ్చారు. ఈదుపురంలో 'బాల్య వివాహముల రహిత భారతదేశం'కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కిశోర బాలికలు ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలను స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి స్వాతి వివరించారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు
- జూన్4న వెన్నుపోటు దినం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు

కంచిలి: కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ ఆరోపించారు. మండల కేంద్రం కంచిలిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలిచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఆ హామీలు బుట్టదాఖలయ్యాయని మండిపడ్డారు. హామీలను అమలు చేయకుండా అక్రమ అరెస్టుల అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజలను డైవర్ట్ చేసేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రయత్నిస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జూన్ నాలుగో తేదీన నియోజకవర్గ కేంద్రంలో చేపట్టనున్న 'వెన్నుపోటు దినం'నిరసన కార్యక్రమాన్ని నియోజకవర్గ పార్టీ క్యాడర్ అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప, సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు ఇప్పిలి కృష్ణారావు, నర్తు నరేంద్రయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఇచ్ఛాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడు బలివాడ ప్రకాశరావు పట్నాయక్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, నాయకులు పిలక సంతోష్, దుర్గాసి ధర్మారావు, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, మద్దు వెంకటరావు, రాంపత్ని చిట్టిబాబు ఉన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

ఇచ్ఛాపురం: యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో రామారావు అన్నారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో క్రీడాకారులు, విద్యార్థులు, స్థానిక యువకులకు యోగా, ధ్యానంపై శనివారం అవగాహన కల్పించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.పద్మనాభంరెడ్డి, టి.గణేష్, శ్రీనివాస్‌పూండి, లత, జోగేష్ పాల్గొన్నారు.

కోర్టు భవనం మార్పు



కోర్టు నూతన భవనం వద్ద మాట్లాడుతున్న జడ్జి మాధురి తదితరులు

కాశీబుగ్గ: పలాసలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టును స్థానిక ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో ఉన్న పాత ఎస్ఎఫ్ఎస్ స్కూల్ భవనాల్లోకి మార్పు చేశారు. ఈ విషయాన్ని ప్రజలు, కక్షిదారులు గమనించాలని మండల న్యాయసేవా సంఘం అధికారి, జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి కోరారు. నూతన భవనంలో వివిధ శాఖల అధికారులతో న్యాయవిజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాధురి మాట్లాడుతూ.. జూలై ఐదో తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీలో ఎక్కడైనా అనాథ పిల్లలు, విడిచిపెట్టేసిన పిల్లలు ఉంటే వారిని గుర్తించి వారందరికీ ఆధార్ కార్డు అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బీకేఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజ్, ఏజీపీ పిండి వెంకట్రావు, సీనియర్ న్యాయవాదులు పైల రాజరత్నంనాయుడు, విఘ్నేష్, రవికుమార్, చంద్రశేఖరరావు, రవి పట్నాయక్, చిట్టిబాబు, తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీడీవో వసంతరావు, డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, ఎంఈఓ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు.లత, కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, వజ్రపుకొత్తూరు ఎస్సై నిహార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.శాంతమ్మ, కార్యదర్శి కంచరాన పార్వతి పాల్గొన్నారు.

'టెన్త్ మూల్యాంకనంలో ప్రభుత్వం ఫెయిల్'

కాశీబుగ్గ: రాష్ట్రంలో పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం సమర్థవంతంగా నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్ అయిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం పలాస నియోజకవర్గం అధ్యక్షుడు బమ్మిడి సంతోష్ కుమార్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. అర్ధ సంవత్సరం పరీక్షల నుంచి పబ్లిక్ పరీక్షల వరకూ పేపర్లు లీకయ్యావని ఆరోపించారు. పరీక్షలు జరిగిన 22 రోజుల్లోనే మూల్యాంకనం పూర్తి చేశామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం జరిగిన పొరపాట్లను మాత్రం గుర్తించలేదన్నారు. 1,15,774 మంది విద్యార్థులు పరీక్ష తప్పినట్టు ప్రకటించారని.. వారిలో 66,363 మంది రీకౌంటింగ్, రీవాల్యూయేషన్ అనంతరం దాదాపు 11,000 మంది ఉత్తీర్ణులైనట్టు ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించిందన్నారు. ఇదంతా చూస్తుంటే మూల్యాంకనం ఎంత లోపభూయిష్టంగా జరిగిందో స్పష్టం అవుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు టీచర్లను దోషులుగా చూపించి సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం దుర్మార్గమన్నారు. మంత్రి లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు చేసిన మోసాల్ని నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ నేతృత్వంలో ఈ నెల నాలుగో తేదీన టెక్కలిలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. దీనికి సంబంధించిన కరపత్రాలను టెక్కలి పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందజేస్తామని గాలి మాటలు చెప్పిన కూటమి నాయకులు ఈ రోజు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కుట్రలు, కక్ష పూరిత చర్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వారిపై అడ్డగోలుగా కేసులు పెడుతున్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అన్నివర్గాలకు ఇబ్బందులకు గురి చేసిన కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి యర్ర చక్రవర్తి, పార్టీ మండల కన్వీనర్ హెచ్.వెంకటేశ్వర్రావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు టి.కిరణ్, నాయకులు సత్తారు సత్యం, కిల్లి అజయ్‌కుమార్, కర్నిక జీవన్, పీత రమణబాబు, బమ్మిడి తులసీరావు, టి.ఫాల్గుణరావు, కె.నారాయణమూర్తి, పోలాకి మోహన్, టి.వైకుంఠరావు, చిన్ని జోగారావు, ఎ.విష్ణు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు గుర్తించాలి

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పట్టణంలో అనుమతుల్లేకుండా జరిగిన నిర్మాణాలను గుర్తించాలని మున్సిపల్ అధికారులకు తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బి.జగన్‌తోపాటు పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పి.రాజలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగింది. పట్టణంలో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు అద్దెకు యంత్రాలు తీసుకోవడానికి కౌన్సిల్ ఆమోదం కోరింది. దీంతో అధికారులు ముందుగా అనుమతులు లేకుండా జరిగిన నిర్మాణాలు గుర్తించి నోటీసులు ఇవ్వాలని సభ్యులు సూచించారు. నోటీసులు ఇచ్చిన తరువాత మున్సిపాలిటీలో ఉన్న యంత్రాలు, ఇతర పరికరాలు ఉపయోగించి అవసరమైనప్పుడు అద్దెకు యంత్రాలు తెచ్చుకోవచ్చన్నారు. అక్రమ నిర్మాణాలు గుర్తించకుండా అద్దెకు యంత్రాలు ఎందుకని సభ్యులు ప్రశ్నించారు. 20వ వార్డులో రూ. 1.95 లక్షలతో, నాలుగో వార్డులో రూ. 2.35 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి, నీటి ట్యాంకులను నడిపేందుకు ఇద్దరు డ్రైవర్ల నియామకానికి, పంపు హౌస్ మరమ్మతులకు రూ. ఐదు లక్షలు కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వర్షకాలంలో పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కమిషనర్ ఎన్.రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

సోంపేట: ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను తోటి ఉద్యోగులు గౌరవించాలని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కె.కిశోర్ బాబు అన్నారు. సోంపేట కోర్టుల సముదాయంలో న్యాయవాదులకు, పారా లీగల్ వలంటీర్లకు లైంగిక వేధింపుల చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు విధులు నిర్వహించే చోట అసభ్యకరంగా ఇబ్బందులు పెట్టకూడదన్నారు. మహిళలు ఇబ్బందులు పడితే ఇంటర్నల్ కమిటీ, డిస్ట్రిక్ట్ కమిటీలకు ఫిర్యాదు చేయాలన్నారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయమూర్తి కె.శ్రీనివాస్, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

రూ. 1.50 లక్షల ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన దుమ్ము ఏకాంబరం రైలు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన హ్యాండ్స్ టుగెదర్ ట్రస్ట్ ప్రతినిధులు రూ.1.50 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి శనివారం అందజేసి అండగా నిలిచారు. ట్రస్ట్ ప్రతినిధులు ఆదినారాయణ, కోదండరావు, గణపతి, సింహాచలం, వెంకటరమణ, భాస్కర్ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



పూజల్లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కవిటి: మాణిక్యపురం పంచాయతీ కణితిపుట్టుగలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. ఒడిశాకు చెందిన పురోహితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం



కవిటి: పూజల్లో ఎమ్మెల్సీ రామారావు దంపతులు

కవిటి : కవిటి మండలం జగతిలో వెలసిన జగదీశ్వర స్వామి ఆలయంలో నూతన పానుమట్టము, ధ్వజస్తంభ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా శివపార్వతుల కల్యాణోత్సవం శనివారం నేత్రపర్వంగా సాగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.